
సాక్షి
అనంతపురం

మంగళవారం । 22 । జూలై । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.33

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 31.2°/22.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ మేరకు కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించడంతో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ పీవీ మిథున్ రెడ్డి అందుబాటులో లేరు. ఆయన అందుబాటులోకి వచ్చే వరకు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

'ఇంజినీర్లను రాజకీయంగా వేధిస్తారా?'

అనంతపురం సెంట్రల్: జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఇంజినీర్లను రాజకీయ వేధింపులకు గురిచేయడం తగదని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తరుణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు జీవన్, సుధాకర్, అల్తాఫ్ మండిపడ్డారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు స్పెషల్ సబ్ డివిజన్ ఏఈఈ కిషోర్ రాజకీయ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటానని లేఖ రాయడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. ఆయన బదిలీ అయిన స్థానంలోకి చేర్చుకోకుండా స్థానిక ఎమ్మెల్యే, కొందరు అధికారులు ఇబ్బందులకు గురిచేయడంతో మనస్తాపానికి గురయ్యాడన్నారు. ఒక దళిత ఉద్యోగికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై సీఎం, డిప్యూటీ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


'ప్రత్యేక హాస్టళ్ల'లో ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం రూరల్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రత్యేక వసతి గృహాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన తెలిపారు. అనంతపురం నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో బాలురకు, అరవింద్ నగర్‌లో బాలికలకు ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటు చేశామన్నారు. 3వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న ఉమ్మడి జిల్లాకు చెందిన దివ్యాంగులు, బధిరులు, అంధ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7893577797, 08554-232380 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'బీటీహెచ్'లో 16 మంది విద్యార్థులకు అడ్మిషన్

అనంతపురం: బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్), జేఎన్‌టీయూ (ఏ) సంయుక్తంగా అందజేస్తున్న ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌లో మొత్తం 16 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు తెలిపారు. కంప్యూటర్ సైన్సెస్‌లో 13 మంది, ఈసీఈ విభాగంలో ముగ్గురు విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను సోమవారం అందజేశారు. బీటెక్‌లో మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో, ఫైనలియర్ బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్)లో చదవాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూ, బీఎస్ డిగ్రీని బ్లెకింగ్ వర్సిటీ అందజేస్తుందన్నారు. అనంతరం ఎంఎస్ సైతం చదవడానికి వీలు కల్పిస్తారన్నారు. విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి విద్యార్థులకు గొప్ప అవకాశమని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, ఫారిన్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ పి. సుజాత, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఏ. సురేష్ బాబు, స్వీడన్ వర్సిటీ అధికారులు వేల్పుల గురుదత్త, ఫణి శేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

14 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: మూడు రోజులుగా జిల్లాలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 14 మండలాల పరిధిలో 3.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది.యాడికి 32.4,పెద్దపప్పూరు 21.2, గుంతకల్లు 17.2 మి.మీ వర్షం కురిసింది. శింగనమల, తాడిపత్రి, పుట్లూరు, గుత్తి, వజ్రకరూరు, నార్పల, రాప్తాడు, యల్లనూరు, పెద్దవడుగూరు, పామిడి, గార్లదిన్నె తదితర మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

స్టాంపుల కథ కంచికి!

- కళ్యాణదుర్గం స్టాంపుల స్కామును పక్కదారి పట్టించిన పెద్దలు
- ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు గండి
- బడా సంస్థల భాగస్వామ్యం ఉండటంతోనే దర్యాప్తు అటకెక్కినట్టు విమర్శలు
- సీఐడీ లాంటి సంస్థలతో దర్యాప్తు చేయాల్సిన స్కాం అంటున్న నిపుణులు
- ప్రతిపక్ష నేతలపై చిన్న ఆరోపణలకే సిట్‌లు వేస్తున్న సర్కారు
- కోట్లు కొల్లగొట్టిన కేసులో దర్యాప్తు మమ అనిపించిన వైనం



సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన నకిలీ స్టాంపుల కుంభకోణం కథ 'కంచి'కి చేరినట్లుగా కనిపిస్తోంది. చిన్న విషయాలకే ప్రతిపక్ష పార్టీ నేతలపై సీఐడీ, సిట్‌లతో దర్యాప్తు చేయించి అక్రమ కేసులు పెట్టి జైళ్లలో వేయిస్తున్న కూటమి సర్కారు.. కళ్యాణదుర్గం కేంద్రంగా జరిగిన నకిలీ స్టాంపుల కుంభకోణం కేసును మాత్రం నీరుగార్చింది. గతంలో కృష్ణ యాదవ్, తెల్గీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కేంద్రంగా భారీ స్టాంపుల కుంభకోణం జరిగింది. తర్వాత ఆ స్థాయిలో జరిగింది మాత్రం 'దుర్గం'లోనే. ఈ కుంభకోణం వెనుక అధికార పార్టీ పెద్దలుండటంతోనే కేసును తొక్కిపెట్టినట్టు తెలుస్తోంది.

స్థానిక పోలీసులకు అప్పగించినప్పుడే!

తొలుత స్టాంపుల కుంభకోణం బయటపడినప్పుడు ఎస్పీ పరిధిలో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేశారు. ఆ తర్వాత కేసు నమోదైన స్టేషన్ పరిధిలోనే దర్యాప్తు చేయాలని కళ్యాణదుర్గం పోలీసులకు బదలాయించారు ఇలా వారికి అప్పగించినప్పుడే సగం దర్యాప్తు చచ్చిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఐడీ లాంటి సంస్థకు కేసును అప్పగించి విచారిస్తే కుంభకోణం వెనుక ఎవరున్నారో తెలిసే అవకాశం ఉండేది. కానీ ప్రభుత్వం దీనికి ససేమిరా అంది. అక్రమాలను తవ్వితే తమ పార్టీ నేతల పాత్ర బయటికొస్తుందన్న ఉద్దేశంతోనే ఇలా చేసినట్టు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికార పార్టీ నాయకులు ఎలా చెబితే లోకల్ పోలీసులు అలా కేసు రాస్తారని అందరికీ తెలిసిందే. అయినా స్థానిక పోలీసులతోనే దర్యాప్తు మమ అనిపించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ పెద్దలు ఉండటంతో కేసు నీరుగార్చినట్టు తెలుస్తోంది. లింకులున్న నేతలంతా అధికార పార్టీ వాళ్లే కావడంతో పోలీసులు కూడా ఉదాసీనంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టాంపుల కుంభకోణంలో ప్రధాన నిందితుడు చిన్న చేపమాత్రమే అని, లోతుగా విచారణ చేస్తే పెద్ద చేపలు బయటికొచ్చే అవకాశముందని సర్వత్రా చర్చ జరుగుతోంది.

మీసేవా నిర్వాహకుడు ఈ స్థాయిలో చేయగలడా?

సుమారు రూ.20 కోట్లకు పైగా జరిగిన ఈ-స్టాంపుల కుంభకోణం ఇటీవల వెలుగులోకి వచ్చింది. కళ్యాణదుర్గంలో మీ-సేవ నిర్వాహకుడు బాబును కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించారు. కానీ ఓ చిన్న స్థాయి వ్యక్తి ఇంత పెద్ద స్థాయిలో 'కంపెనీ' యాజమాన్యానికి తెలియకుండా అక్రమాలు చేసి ఉంటాడా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరి ప్రమేయమూ లేకుండా ఈ స్థాయిలో అవకతవకలు చేయడానికి అతనికి అంత శక్తి లేదని, 'పెద్ద' సంస్థ అండ లేకుండా భారీ మొత్తంలో బాబు కొల్లగొట్టలేడని నిపుణులు చెబుతున్నారు.

జల్సాలకు అలవాటు పడి బైకుల అపహరణ

- నలుగురు మైనర్లతో పాటు ముగ్గురి అరెస్ట్

అనంతపురం: జల్సాలకు అలవాటు పడి బైకులను చోరీ చేస్తున్న నలుగురు మైనర్లతో పాటు ముగ్గురిని అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాస రావు మీడియాకు వెల్లడించిన వివరాల మేరకు... అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన బైనేని యతీంద్ర అలియాస్ శివా, బోగిశెట్టి యోగీశ్వర్ అలియాస్ యోగి, అనంతపురంలోని గంగానగర్‌కు చెందిన సి. యశ్వంత్ కుమార్ అలియాస్ బన్నీలు జల్సాలకు అలవాటు పడ్డారు. మరో నలుగురు మైనర్లతో కలిసి ఓ ముఠాను ఏర్పాటు చేశారు. బైకులను చోరీ చేయడం ప్రారంభించారు. ఇళ్లు, ఆస్పత్రుల వద్ద పార్కు చేసిన బైక్‌లను దొంగిలించేవారు.సోమవారం ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ వైపు నుంచి లగేజీ ఆటోలో ఈ ఏడుగురు అనుమానాస్పదంగా వెళ్తుండడం చూసిన కొందరు.. పోలీసులకు సమాచారం అందించారు.ఈ క్రమంలో టూ టౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్‌ఐ రుష్యేంద్ర బాబు, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. విచారిస్తే బాగోతమంతా బయటపడింది. అనంతపురం నగరంతో పాటు ధర్మవరం, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో రెండేళ్ల నుంచి బైక్‌లను చోరీ చేస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ క్రమంలో వారి వద్ద నుంచి 19 బైక్‌లు, ఒక లగేజీ ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.19 లక్షలు ఉంటుందని డీఎస్పీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. యతేంద్ర అలియాస్ శివా ముఠాలో ముఖ్యుడని, ఇతనిపై ఇది వరకే 8 బైక్ చోరీ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. సీఐ శ్రీకాంత్, ఎస్‌ఐ రుష్యేంద్రబాబు, ఇతర సిబ్బందిని ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

పోలీసుల బరితెగింపు

- హోంమంత్రి పర్యటన పేరుతో వైఎస్సార్ సీపీ శ్రేణుల హౌస్ అరెస్టు
- యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్ర ఇంట్లో అర్ధరాత్రి హల్‌చల్
- ఇంటి నుంచి బయటకెళ్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని సీఐ బెదిరింపు



కూటమి ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతున్న సాకే చంద్ర, పార్టీ నాయకులు



చామలూరు రాజగోపాల్, కట్టుబడి తనీష తదితరులను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అనంతపురం కార్పొరేషన్: హోంమంత్రి పర్యటన పేరుతో పోలీసులు బరితెగించారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లికి చెందిన మైనర్ బాలిక.. మృగాళ్ల చేతిలో పాశవికంగా అత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఇటీవల ఆమె బిడ్డకు కూడా జన్మనిచ్చింది.ఈ క్రమంలో బాధితురాలికి న్యాయం చేయాలన్న డిమాండ్‌తో కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆదివారం సర్వజనాస్పత్రిలో బాలికను పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సాకే చంద్ర మాట్లాడుతూ బాలికకు న్యాయం జరగకపోతే సోమవారం హోంమంత్రి అనిత పర్యటనను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అదే రోజు అర్ధరాత్రి చంద్ర నివాసానికి పోలీసులు వెళ్లి హల్‌చల్ చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదని, కాదని వెళ్తే కేసు నమోదు చేసి, రౌడీషీట్ ఓపెన్ చేస్తామంటూ టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ ఫోన్‌లో చంద్రను బెదిరించారు. దళిత బిడ్డకు న్యాయం చేయాలని, ఈ విషయంలో పోలీసులు తమకు సహకరించాలని సాకే చంద్ర శేఖర్ కోరగా.. ఫోన్‌లోనే టూటౌన్ సీఐ రెచ్చిపోయినట్లు తెలిసింది.

బాంచన్.. మీ కాళ్లు అనాలా..?

కూటమి ప్రభుత్వ తీరుపై సోమవారం సాకే చంద్ర విలేకరులతో మాట్లాడారు. మడకశిరలో హోం మంత్రి అనితకు శాంతియుతంగా వినతి పత్రం అందించాలని నిర్ణయించామని, కానీ పోలీసులు కూటమి ప్రభుత్వ కనుసన్నల్లో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఐపీఎస్ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయరాదన్నారు. బాలికను అత్యంత పాశవికంగా పదుల సంఖ్యలో అత్యాచారం చేశారని, ఇంత వరకు బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఏడుగుర్రాల పల్లికి మైనర్ బాలిక వెళితే బతకనిస్తారా అని వాపోయారు. 'ఫోన్‌లో హలో అనడం కూడా తప్పంటే ఎలా? బాంచన్.. మీ కాళ్లు మొక్కుతా అని అనాలా' అంటూ టూటౌన్ సీఐను ప్రశ్నించారు. పోలీసులు, కూటమి నాయకుల బెదిరింపులకు తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నగరాధ్యక్షుడు శ్రీనివాస దత్తా, ఉపాధ్యక్షుడు వినీత్, నాయకులు మైను, బ్రహ్మానంద రెడ్డి, గుజ్జల శివయ్య, సాకే శ్రీనివాసులు, అంజి, తదితరులు చంద్రకు మద్దతుగా నిలిచారు.

నాయకుల హౌస్ అరెస్టు..

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, ఆర్టీసీ రీజినల్ బోర్డు మాజీ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్,ఇంటెలెక్చువల్ ఫోరం కట్టుబడి తనీష, నాయకులు సాకే రామాంజినేయులు, నార్పల అంజి, నగేష్, ఆనంత్, గగన్, పార్టీ నగరాధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, నాటక అకాడమీ మాజీ రాష్ట్ర చైర్‌పర్సన్ హరిత, కార్పొరేటర్ జయలలిత, నాయకులు అనిల్‌కుమార్ గౌడ్, లీలావతి, ఉష, తలారి ఉష, జయమ్మ, తదితరులను కూడా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

'పరిష్కార వేదిక'కు 612 వినతులు



తండ్రి మహబూబ్‌పీరా చేతిలో ఉన్న ఈ బాలిక పేరు జరీనాబాను బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న ఈ బాలిక వయసు 9 సంవత్సరాలు. వీరిది గుత్తి మండలం మాముడూరు గ్రామం. జరీనాబానుకు 100 శాతం వైకల్యం ఉన్నట్లు గత ఏడాది సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు కాలేదు. పింఛను మంజూరయ్యేలా చూడాలని కలెక్టరేట్‌లో సోమవారం అధికారులను తల్లిదండ్రులు వేడుకున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అధికారులు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వినతులు పోటెత్తాయి. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 612 అర్జీలు అందాయి. ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, రామ్మోహన్, తిప్పేనాయక్, మల్లికార్జునుడు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అధికారులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ సమీక్షించారు.అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. పీ 4 కింద మార్గదర్శకుల గుర్తింపు వేగవంతం చేయాలని చెప్పారు. ప్రాజెక్టులకు భూసేకరణ,రెవెన్యూ సేవలు, రీ-సర్వే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని....

- తమ భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేశారని విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన చిన్నతమ్మప్ప ఫిర్యాదు చేశాడు. సర్వే నంబరు 244లో 1.79 ఎకరాలు, 551లో 1.74 ఎకరాలు తన పేరున రిజిస్టర్ అయ్యిందన్నారు. అయితే ఈ భూమిని వేరొకరు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారని చెప్పాడు. విచారణ చేయించి న్యాయం చేయాలని కోరాడు.
- రోడ్డు కోసం తమ స్థలం తీసుకుని నగర పాలక సంస్థ అధికారులు పరిహారం మంజూరు చేయలేదని అనంతపురం నగరంలోని కోవూరు నగర్‌కు చెందిన సురేష్‌బాబు ఫిర్యాదు చేశాడు. రోడ్డు నిర్మాణం కోసం తమ 60 సెంట్లను తీసుకున్నారని, పరిహారం ఇవ్వాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయాడు. పరిహారం ఇవ్వాలని, లేదంటే భూమినైనా వెనక్కి ఇప్పించాలని విజ్ఞప్తి చేశాడు.

రాజకీయ కుట్రతోనే మిథున్ అరెస్టు

- వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి



అనంతపురం కార్పొరేషన్: రాజకీయ కుట్రలో భాగంగానే ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. మిథున్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం ఎంతగానో పాడుపడుతున్నారన్నారు. లిక్కర్ పాలసీ రూపకల్పన, అమలులో ఆయన పాత్ర లేకపోయినా తప్పుడు ఆరోపణలు మోపుతూ.. రాజకీయ ప్రేరణతో పోలీసులు అరెస్టు చేశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 43 వేల బెల్ట్ షాపులను మూసివేయించారని, లిక్కర్ షాపులను 4,380 నుంచి 2,934కు తగ్గించారని గుర్తు చేశారు. పారదర్శకంగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. అప్పట్లో లిక్కర్ పాలసీపై వచ్చిన ఫిర్యాదులను విచారించిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ).. ప్రభుత్వ పాలసీలో ఎలాంటి లోపాలు లేవని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మద్యం అమ్మకాలకు సంబంధించి గుత్తాధిపత్యాన్ని నియంత్రిస్తుందని పేర్కొందన్నారు. కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల పక్షాన నిలుస్తున్న నాయకులను అరెస్టు చేస్తోందని దుయ్యబట్టారు. భవిష్యత్తులో నిజం గెలుస్తుందని, కుట్రలు, కుతంత్రాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు.

బాబు మూల్యం చెల్లించుకోక తప్పదు

- మాజీ మంత్రి సాకే శైలజానాథ్ హెచ్చరిక



అనంతపురం కార్పొరేషన్: ఎంపీ పీవీ మిథున్ రెడ్డిని కుట్రపూరితంగానే కూటమి ప్రభుత్వం అరెస్టు చేయించిందని, భవిష్యత్తులో చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు అప్రజాస్వామిక విధానాలతో ముందుకెళ్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విప్లవాత్మక సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. మద్యం విక్రయాలను ప్రభుత్వమే చేపట్టి.. భారీ ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలయాపన చేస్తున్నారన్నారు. మద్యం పాలసీకి సంబంధించి రూ.వేల కోట్లు స్కాం జరిగిందని పూటకోమాట మాట్లాడుతున్నారన్నారు. మొదట్లో రూ.30 వేల కోట్లు, రూ.18 వేల కోట్లు, నేడు ఇంకేదో చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలను అణగ దొక్కేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. రెడ్ బుక్ పేరిట కక్ష సాధింపు చర్యలను కొనసాగిస్తూ.. రాష్ట్రంలో భయాందోళనకర వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ఎన్ని దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులకు పాల్పడినా భయపడే పరిస్థితి లేదని, రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలో బాబుకు తగిన బుద్ధి చెబుతామన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

బీమా.. లేదు ధీమా

పంటల బీమా పథకాలు అన్నదాతకు ధీమా ఇవ్వడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం రైతులకు మేలు జరిగేలా పథకాలకు రూపకల్పన చేయకపోవడం, ప్రీమియం భారం మోపడం వెరసి అన్నదాతకు నష్టం జరుగుతోంది.

ప్రీమియం భారం, ప్రచారలోపం

- పంటల బీమాపై రైతుల అనాసక్తి
- సీజన్ చివరి దశకు చేరుకున్నా 90 వేల మందే బీమా పరిధిలోకి
- గందరగోళంతో లక్షలాది మంది రైతులు ప్రీమియం కట్టలేని దుస్థితి



అనంతపురం అగ్రికల్చర్: బీమా ప్రీమియం చెల్లించడానికి రైతులు అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. వర్షాలు ముఖం చాటేయడం, పంట రుణాల సమయంలో ప్రీమియం కట్టాలా వద్దా.., ఏ పంటకు ఎంత చెల్లించాలి.. పంట రుణాలు తీసుకోని వారు ఎక్కడ ప్రీమియం చెల్లించాలి.. తదితర వివరాలు తెలియక, అవగాహన కల్పించే వారు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులపై ఎలాంటి భారం పడకుండా సర్కారే ప్రీమియం చెల్లించి ఈ-క్రాప్ ఆధారంగా పారదర్శకంగా ఫసల్‌బీమా, వాతావరణ బీమా పథకాలు విజయవంతంగా అమలు చేసింది. ఏటా జూలైలోనే పంటల బీమా కింద అర్హత కలిగిన రైతులకు పెద్ద ఎత్తున పరిహారం కూడా అందించింది. 2019-2024 మధ్య కాలంలో అన్నదాతలకు ఉచిత పంటల బీమా పథకాలు చాలా మేలు చేశాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో నాలుగేళ్లలో పంటల బీమా కింద 14.20 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,883 కోట్ల పరిహారం దక్కింది. ప్రభుత్వం మారడంతో చివరి ఖరీఫ్ 2023 బీమా పథకం కింద 2024లో సీఎం చంద్రబాబు పరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టేశారు. కనీసం 2024 ఖరీఫ్ బీమా కింద ఇవ్వాల్సిన పరిహారంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతులు పంటల బీమా పథకాలపై ఆశలు వదులుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం కావాలనే ఇలా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉచిత బీమా పథకాన్ని రద్దు చేసి ప్రీమియం కట్టాలంటూ నిబంధన విధించడంతో రైతులకు బీమా పథకాల లబ్ధి అందని ద్రాక్షగానే మిగిలిపోయే పరిస్థితి నెలకొంది.

ఇప్పటికి 90 వేల మందే..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బీమా పథకాలకు ప్రీమియం చెల్లింపు గడువు చివరి దశకు చేరుకుంది. ఇప్పటికి 90 వేల మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించి బీమా పరిధిలోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఇంకా రెండు లక్షల మంది పైచిలుకు రైతులు బీమాకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఖరీఫ్‌లో పంట దిగుబడుల ఆధారంగా ప్రధానమంత్రి ఫసల్‌బీమా కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరపకు బీమా పథకం వర్తింపజేశారు. ఇందులో కంది రైతులు ఎకరాకు రూ. 80 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. వరి రైతులు రూ.164, జొన్న రూ.84, మొక్కజొన్న రూ.132, ఆముదం రూ.80, ఎండు మిరప రూ.576 ప్రకారం ఈ నెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలి. ఇక వాతావరణ బీమా పథకం వేరుశనగ, పత్తి, దానిమ్మ, బత్తాయి, టమాట, అరటికి వర్తింపజేశారు. ఇందులో వేరుశనగ ఎకరాకు రూ.640 ప్రకారం ప్రీమియం కట్టాలి. పత్తి రూ.1,140, దానిమ్మ రూ.3,750, చీనీ, బత్తాయి రూ.2,750, టమాట రూ.1,600, అరటి రూ.3 వేల ప్రకారం ఈనెల 15 వరకూ ప్రీమియం వసూలు చేశారు. అయితే, గడువు పొడిగించాలంటూ ప్రతిపాదనలు పంపినా అనుమతులు రాలేదని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. పంటల బీమా పథకాల స్థితిగతుల గురించి అటు కూటమి సర్కారు, ఇటు వ్యవసాయశాఖ ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

బదిలీ టీచర్లకు వేతన కష్టాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,200 మంది ఉపాధ్యాయుల్లో పదోన్నతి దక్కిన ఆనందం ఆవిరైపోయింది. బదిలీపై కొత్త ప్రాంతానికి వెళ్లిన వారు జీతాలు అందక నానా అగచాట్లు పడుతున్నారు. కీలకమైన జూన్ మాసంలో పిల్లల ఫీజులు, బ్యాంకు లోన్లు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. మరో పది రోజుల్లో జూలై మాసం కూడా ముగియనున్న తరుణంలో రెండు నెలల జీతాలు ఆగస్టులో ప్రభుత్వం చెల్లిస్తుందో.. లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- పదోన్నతులు, బదిలీల టీచర్లకు పొజిషన్ ఐడీలు రాక అందని జీతాలు
- ఇబ్బందుల్లో ఉమ్మడి జిల్లాలో 2,200 మంది ఉపాధ్యాయులు
- పిల్లల ఫీజులు, బ్యాంకు లోన్ల కంతులకు అగచాట్లు


పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'ఉపాధ్యాయ బదిలీ చట్టం' ద్వారా ఇటీవల పలువురు టీచర్లకు పదోన్నతులు, బదిలీలు జరిగాయి. వీరిలో వేలాది మందికి పొజిషన్ ఐడీలు రాక జూన్ నెల జీతం ఇప్పటి వరకూ అందలేదు. మరో వారం గడిస్తే రెన్నెళ్ల జీతం అందాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,152 మంది టీచర్లు బదిలీ అయ్యారు. వీరిలో గ్రేడ్–2 హెచ్ఎంలు 133 మంది, పీఎస్‌హెచ్ఎంలు 193 మంది, స్కూల్ అసిస్టెంట్లు 3,478 మంది, ఎస్జీటీలు 3,208 మంది, పండిట్లు 111 మంది, పీఈటీలు 29 మంది ఉన్నారు. సాధారణంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓలకు సమాచారం అందిస్తారు. గతంలో రెగ్యులర్ జీతాలు తీసుకుంటున్నా...వీరి స్థానం మారడంతో బదిలీ అయిన స్థానానికి పొజిషన్ ఐడీ కేటాయించాల్సి ఉంటుంది. ఆ తర్వాతనే సీఎఫ్ఎంఎస్‌లో వారి వివరాలు కనిపిస్తాయి. అప్పుడు జీతాలు చెల్లించడానికి వీలుంటుందని ఉద్యోగ, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

జీతాల కోసం ఎదురు చూస్తున్న 5 రకాల పాఠశాలల టీచర్లు..

కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పది రకాల పాఠశాలల్లో 5 రకాల పాఠశాలల ఉపాధ్యాయులు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కేడర్ల టీచర్లు దాదాపు 2,200 మందికి జూన్ నెల వేతనాలు జమ కాలేదు. అప్‌గ్రేడ్ అయిన ప్రాథమికోన్నత పాఠశాలలు, కొత్తగా ఏర్పాటైన మోడల్ ప్రైమరీ పాఠశాలలు, కొత్తగా పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్లు, గ్రేడ్–2 హెచ్ఎంలకు జీతాలు రాలేదు. వీరందరికీ పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. ముఖ్యంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలను కేటాయించారు. వాస్తవానికి ఆ పాఠశాలల్లో గతంలో కేడర్ స్ట్రెంత్‌కు అనుగుణంగా ఉన్న పోస్టులకు జీతాలు చేసే వీలుంటుంది. కొత్తగా వచ్చిన పోస్టులకు పొజిషన్ ఐడీలు కేటాయించిన తర్వాతనే జీతాలకు అవకాశం ఉంటుంది. అప్‌గ్రేడ్ అయిన యూపీ స్కూళ్ల టీచర్లకు ఇదే ప్రధాన సమస్యగా మారింది. ఇక్కడ డీడీఓ మారడంతో ఏ ఒక్కరికీ జీతభత్యాలు అందలేదు. పొజిషన్ ఐడీలు మండల స్థాయిలో నిర్ధారించి, జిల్లాకు.. ఇక్కడి నిర్ధారించి రాష్ట్రానికి పంపాల్సింది పోయి, నేరుగా రాష్ట్ర స్థాయిలో కేటాయించే చర్యలు చేపట్టడంతో సమస్య ఉత్పన్నమవుతోందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు. రాష్ట్రస్థాయిలో స్పష్టత రాక తిరిగి జిల్లా నుంచి 8 నుంచి 10 మంది సాంకేతిక నిపుణులను పిలిపించి వారం రోజులకు పైగా సరి చేయాల్సి వచ్చింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు	
గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు	133 మంది
పీఎస్‌హెచ్ఎంలు	193 మంది
స్కూల్ అసిస్టెంట్లు	3,478 మంది
ఎస్జీటీలు	3,208 మంది
పండిట్లు	111 మంది
పీఈటీలు	29 మంది

పిల్లల ఫీజులు, బ్యాంకులోన్ల కంతులకు అగచాట్లు..

కీలకమైన జూన్ నెలకు సంబంధించిన వేతనాలు రాకపోయేసరికి చాలామంది టీచర్లు పిల్లల చదువులకు ఫీజులు, బ్యాంకు లోన్ల కంతులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేయాల్సి వస్తోందంటూ వాపోతున్నారు. వారం రోజులు గడిస్తే జూలై జీతం రావాల్సి ఉందని, రెన్నెళ్ల జీతమైనా ఆగస్టులో వచ్చేలా అధికారులు చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

వ్యాపారిపై చర్యలు తీసుకోండి

- రూ.23 లక్షలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అనంతపురం అర్బన్: పంట కొనుగోలుకు సంబంధించి డబ్బు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న వ్యాపారిపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... కణేకల్లు మండలం పులిచెర్ల, నాగిరెడ్డిపల్లి, కె.కొత్తపల్లి, పామిడి మండలం ఎద్దులపల్లి, పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లి రైతులకు మొక్కజొన్న, సజ్జ విత్తనాభివృద్ధి కోసం సత్య అగ్రిటెక్ ద్వారా వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన వ్యాపారి వెంకట్రామిరెడ్డి విత్తనాలు ఇప్పించాడన్నారు. దిగుబడి మొత్తం తానే కొనుగోలు చేసి, పంట తరలించే సమయంలో కొంత సొమ్ము ఇప్పించాడని తెలిపారు. మిగిలిన సొమ్ము రూ.23,18,600 చెల్లించకుండా నాలుగు నెలలుగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. అధికారులు ఆ వ్యాపారిపై చర్యలు తీసుకుని రైతులకు డబ్బు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు అనుమేష్, శ్రీను, చిన్నతిప్పేస్వామి, శ్రీనివాసులు, రామాంజనేయులు, రుద్రయ్య, నాగేష్, నాగరాజు, జయరామిరెడ్డి ఉన్నారు.

26 నుంచి 'హనుమాన్ దర్శన్'

- ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు

అనంతపురం క్రైం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని మురడి, నేమకల్లు, కసాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాలను ఒకే రోజు సందర్శించుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు ఆ సంస్థ ఆర్ఎం సుమంత్.ఆర్.ఆదోని సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26 నుంచి ప్రతి శని, మంగళవారాల్లో హనుమాన్ దర్శన్ పేరుతో అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఈ నెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16, 19 బస్సులు బయలుదేరుతాయి. రద్దీకి అనుగుణంగా 50 మంది ఒకే బ్యాచ్‌గా ప్రయాణించాలనుకుంటే వారి ప్రాంతానికే ప్రత్యేకంగా బస్సును పంపిస్తారు.

'కేజీబీవీ' అరబిక్ టీచర్లకు షాక్


కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన అరబిక్ ఇన్‌స్ట్రక్టర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: మైనార్టీ కేజీబీవీల్లో పదేళ్లుగా అరబిక్ టీచర్లు (ఇన్‌స్ట్రక్టర్లు)గా పని చేస్తున్న వారికి కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈసారి వారిని తీసుకోవద్దంటూ ఉన్నతాధికారుల నుంచి కేజీబీవీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకుండా మౌఖిక ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశమైంది. దీంతో బాధిత టీచర్లు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి గ్రీవెన్స్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు.

తక్కువ వేతనంతో పని చేస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు

ఉమ్మడి జిల్లాలోని ఆరు మైనార్టీ కేజీబీవీల్లో అరబిక్ ఇన్‌స్ట్రక్టర్లు పనిచేస్తున్నారు. వీరు రోజూ ఒక పిరియడ్ మాత్రమే బోధిస్తారు. నెలకు వీరికి రూ.4 వేలు చొప్పున అతి తక్కువ వేతనాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. అయినా ఏళ్ల తరబడి చేస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని కురుగుంట, తాడిపత్రి, గుంతకల్లు కేజీబీవీల్లో వీరు పని చేస్తున్న వారిని ఈసారి రెన్యూవల్ చేయలేదు. సేవాభావంతో పని చేస్తున్న తమను ఇలా అర్ధంతరంగా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా రావద్దని చెప్పడం అన్యాయమని బాధిత ఇన్‌స్ట్రక్టర్లు గౌసియా బేగం, ఫర్హాన, అఫ్రోజ్ బేగం ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కె.విజయ్ మాట్లాడుతూ... కేజీబీవీల్లో పదేళ్లుగా పని చేస్తున్న అరబిక్ టీచర్లను ఈసారి తొలిగించడం అన్యాయం అన్నారు. కాగా దీనిపై జీసీడీఓ కవిత 'సాక్షి'తో మాట్లాడుతూ.. రాష్ట్ర కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు అందాయని ఈ క్రమంలో వారిని తొలిగించామంటున్నారు.

ప్రశ్నించే గొంతుకను హింసించడం తగదు

- ప్రజల దృష్టి మళ్లించేందుకే మద్యం అక్రమ కేసు
- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గం
- గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఏపీలో సర్కార్ వైఫల్యాలు, మోసాలపై ప్రజల తరపున ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలపై అక్రమ కేసులు పెట్టి హింసించడం తగదని కూటమి ప్రభుత్వ పెద్దలకు గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హితవు పలికారు. అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమమని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను కప్పిపుచ్చుకునేందుకు లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి సంబంధం లేని వ్యక్తులు, అధికారులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు. గతంలో లిక్కర్ స్కామ్‌లో అడ్డంగా దొరికిన చంద్రబాబు.. ఆ కేసు నుంచి బయటపడేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలోనూ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజల్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న విశేష ఆదరణ చూసి ఓర్వలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకూ వైఎస్సార్‌సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జింకల రామాంజనేయులు, పట్టణ, మండల అధ్యక్షులు ఎండీ.ఖలీల్, పి.రాము, పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు రంగనాయకులు, బాబూరావు, వీరేష్, బాసిద్, కౌన్సిలర్లు చాంద్‌బాషా, సుమోబాషా, సీనియర్ నాయకులు మల్లికార్జున శాస్త్రి, నూర్ నిజామి, ఫ్లయింగ్ మాబు, ఎంఎం రెహమాన్, ఆర్‌డీజీ బాషా, మౌలా, బావన్న తదితరులు పాల్గొన్నారు.

మస్తానయ్య ఉరుసు శుభాకాంక్షలు

గుంతకల్లులోని హజరత్ మస్తాన్‌వలి స్వామి దర్గా ఉరుసు ఉత్సవాల సందర్భంగా భక్తాదులకు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. హజరత్ మస్తాన్‌వలి అనుగ్రహంతో సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.

పోలీసు బందోబస్తు నడుమ సోలార్ టవర్ల ఏర్పాటు


సోలార్ టవర్ పనుల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

యాడికి: మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామ పొలాల వద్ద సోలార్ టవర్ నిర్వాహకులకు, కార్మికులకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని రాయలచెరువు, వేములపాడు గ్రామాల మధ్య తూట్రాళ్లపల్లి గ్రామ పొలాల్లో పవర్ గ్రిడ్ అనంతపురం–కర్నూలు ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ మానస్ ఆధ్వర్యంలో సోలార్ టవర్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నెల 16న జేసీ ప్రభాకర్‌రెడ్డి, 40 మంది అనుచరులతో కలసి సోలార్ పనులు చేయకూడదని ఇంజినీర్లతో పాటు కార్మికులను దుర్భాషలాడడంతో జనరల్ మేనేజర్ మానస్ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఆదివారం యాడికి సీఐ ఈరన్న కేసు నమోదు చేసి, సోమవారం ఉదయం నుంచి పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

యువకుడి దుర్మరణం


కుళ్లాయప్ప (ఫైల్)

బుక్కరాయసముద్రం: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్ మండలం రేకులకుంట గ్రామానికి చెందిన నల్లప్ప, నాగవేణి దంపతుల కుమారుడు కుళ్లాయప్ప (20) అనంతపురంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో సోమవారం ద్విచక్ర వాహనంలో అనంతపురానికి బయలుదేరాడు. మండల కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీలో నార్పల రహదారిపై మలుపులో ఎదురుగా ద్విచక్ర వాహనం వస్తున్న బీకేఎస్ గ్రామానికి చెందిన పవన్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో కుళ్లాయప్ప తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్ కాళ్లు, చేతులు విరిగాయి. అటుగా వెళుతున్న ఎస్ఐ శేఖర్.. క్షతగాత్రుడిని తన వాహనంలో వెంటనే సర్వజనాస్పత్రికి చేర్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బంగారు దుకాణాల్లో తనిఖీల కలకలం

కళ్యాణదుర్గం రూరల్: జిల్లా కేంద్రం నుంచి సోమవారం వచ్చిన పోలీసులు కళ్యాణదుర్గంలోని పలు బంగారం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కళ్యాణదుర్గానికి ఓ వ్యక్తి తన బంగారం ఆభరణాలను వ్యక్తిగత అవసరాల కోసం అనంతపురంలోని ఓ దుకాణంలో తాకట్టు పెట్టడానికి వెళ్లాడు. ఆ సమయంలో అతని ప్రవర్తనపై అనుమానాలు రావడంతో దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు అప్రమత్తమైన పోలీసులు వెంటనే సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో ఆ బంగారాన్ని తాను కళ్యాణదుర్గంలోని దుకాణాల్లో కొనుగోలు చేసినట్లుగా తెలిపాడు. దీంతో సోమవారం జిల్లా కేంద్రం నుంచి వచ్చిన పోలీసులు స్థానిక దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, పలువురు యజమానులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో మస్తానయ్య గంధోత్సవం


ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు: పాత గుంతకల్లులోని హజరత్ మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంధం ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు దర్గా ధర్మకర్తలు, వక్ఫ్‌బోర్డు అధికారులు, ముజావర్ల నేతృత్వంలో వేలాదిగా తరలివచ్చిన భక్తుల సమక్షంలో గంధోత్సవం వైభవంగా సాగింది. మేళతాళాలతో దర్గా నుంచి గణాచారిరెడ్డి కులస్తుల ఇంటికి గంధం చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. ఉత్సవాలకు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాలు నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో పాత గుంతకల్లు కిక్కిరిసింది. మస్తానయ్య స్వామి అభివృద్ధి సేవా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. ధర్మకర్తలు జి.బాబురెడ్డి, తిమ్మారెడ్డి, మంతకల్లురెడ్డి, సభ్యులు టి.సుంకన్న, లక్ష్మన్న, అల్తాఫ్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు టచ్‌ఫోన్లు



టచ్‌ఫోన్లు అందుకున్న బధిరులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ఇంటర్ విద్యార్హత కలిగిన బధిరులకు టచ్ ఫోన్‌లను ఇన్‌చార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సోమవారం అందజేశారు. ఒక్కొక్కటి రూ.15 వేలు విలువ చేసే టచ్‌ఫోన్‌లను ఎనిమిది మంది బధిరులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

పచ్చిరొట్ట ఎరువు వాడకంతో నేల సారవంతం అవుతుందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ అన్నారు. పచ్చిరొట్ట పైర్ల వినియోగంపై వ్యవసాయ శాఖ రూపొందించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో నేలలో సారం పెరిగి, 25 శాతం ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్ఓ మలోల, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, అధికారులు పాల్గొన్నారు.

శనీశ్వరాలయం.. స్వర్ణమయం


బంగారుతో గర్భగుడికి తాపడం చేసిన దృశ్యం

పావగడ: స్థానిక శనీశ్వరాలయం స్వర్ణ దేవాలయంగా మారింది. ఆలయంలో శనీశ్వరస్వామి కొలువు తీరిన గర్భగుడిని బంగారు రేకులతో తాపడం చేశారు. సుమారు 8 కిలోల బంగారంతో చేపట్టిన ఈ పనిని బిహార్ నుంచి వచ్చిన స్వర్ణకారులు విజయవంతంగా పూర్తి చేశారు. పలచని బంగారు రేకును గర్భగుడికి అమర్చడంతో భక్తులు పరవశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. గణపతి పూజ, హోమాలు నిర్వహించారు.

గడువులోపు పనులన్నీ పూర్తి కావాలి


మాట్లాడుతున్న సీఈ అశోక్‌కుమార్

అనంతపురం సిటీ: ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్ట్ (ఏపీఆర్ఆర్‌పీ) కింద మంజూరైన పనులన్నీ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సిందేనని సంబంధిత అధికారులను ఆ విభాగం ప్రాజెక్ట్ డైరెక్టర్, సీఈ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏపీఆర్ఆర్‌పీ రోడ్ల పురోగతిపై సీఈ కార్యాలయ ఈఈ రమణమూర్తితో కలసి అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించిన పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో అనంతపురంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్షించారు. అనంతపురం సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, పీఏ రాజేంద్ర ప్రసాద్, పీఐయూ ఈఈ నవీన్‌కుమార్, ఈఈలు శంకరయ్య, రఘునాథరెడ్డి, డీఈఈలు, ఏఈఈలు హాజరయ్యారు. నాలుగేళ్లలో అనంతపురం జిల్లాకు సంబంధించి రూ.209 కోట్లతో 138 రోడ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 52 పనులు పూర్తయ్యాయని, 42 పనులు ప్రోగ్రెస్‌లో ఉండగా, 44 పనులు రద్దయినట్లు ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. మొత్తం రూ.101 కోట్లు ఖర్చు పెట్టి 195.71 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించినట్లు తెలిపారు. గడువులోపు పనులన్నీ పూర్తి నాణ్యతగా చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' అమలు చేయాలి

- వైఎస్సార్‌ఎస్‌యూ నాయకుల వినతి


ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

అనంతపురం అర్బన్: అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మను వైఎస్సార్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ)లోని సెక్షన్ 12(1)సి కింద 2024–25 విద్యాసంవత్సరంలో ఉచిత సీటును జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిరాకరించాయని గుర్తు చేశారు. దీంతో తల్లికి వందనం పథకం కింద అందాల్సిన రూ.13 వేలు నేరుగా పాఠశాలల ఖాతాల్లో జమ చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఏర్పడిన ద్వంద్వ నష్టంపై విచారణ చేపట్టి ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఫిట్‌నెస్‌లేని బస్సులు నడుపుతున్నాయని, తనిఖీలు నిర్వహించి అలాంటి వాటిని సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, కైలాష్, ఫయాజ్, వంశీనాయుడు, చంద్రమౌళి, రాహుల్ రెడ్డి, రఫీ, పులి కార్తికేయ, శేఖర్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్, వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మను కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ఈ నెల 17న డీపీఓ నాగరాజునాయుడుని జేసీ ప్రభాకర్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించారని గుర్తు చేశారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకపరుస్తూ భౌతిక దాడులకు సిద్ధపడడం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా ఇలాంటి ఘటనల్లో బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు రమణ, సుధాకర్, లక్ష్మీనారాయణ, భైరవ్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ అసభ్య ప్రవర్తనపై విచారణ


డీవైఈఓతో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతూరు జెడ్పీహెచ్ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సతీష్‌కుమార్ వ్యవహార శైలిపై సోమవారం డీవైఈఓ మల్లారెడ్డి విచారణ చేపట్టారు. మూడు రోజుల క్రితం విద్యార్థినులతో ఆయన అసభ్యంగా మాట్లాడటంతో వారి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని నిలదీసిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే ఎంఈఓ ఎర్రిస్వామి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఈ నేపథ్యంలో సోమవారం డీవైఈఓ మల్లారెడ్డి పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో వేర్వేరుగా విచారణ చేపట్టారు. కాగా, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన సతీష్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని డీవైఈఓ మల్లారెడ్డిని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఉరవకొండ నియోజకవర్గ కన్వీనర్ భీమేష్ కోరారు. ఇదివరకు పనిచేసిన పాఠశాలలో కూడా సతీష్‌కుమార్ వ్యవహార శైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు ఉన్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కామిక ఏకాదశి



అలంకరణలో రుక్మిణీ పాండురంగ విఠలుడు

అనంతపురం కల్చరల్: భావసార క్షత్రియులు పవిత్రంగా భావించే కామిక ఏకాదశి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. రామనగర్‌లోని రుక్మిణీ విఠల పాండురంగస్వామి ఆలయంలో స్వామివారి నిజరూపదర్శనం ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భావసార క్షత్రియ సమాజ్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నిజరూపదర్శనంలోని రుక్మిణీ పాండురంగడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకృష్ణ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తిరుపతిరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

28న కాలభైరవ కుంభోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీ మంజునాథ ఆలయంలో శ్రావణ మాసంలో వచ్చే తొలి సోమవారం కాలభైరవేశ్వర స్వామి కుంభోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బసవరాజ స్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకం, భస్మార్చన జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు.

సర్వమతాలకు దేవుడు ఒక్కడే



భగవద్గీతను ప్రచారం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని భైరవనగర్, హమాలీ కాలనీ తదితర చోట్ల భగవద్గీత ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ సందర్భంగా ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున నేతృత్వంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత విశిష్టతను వివరించారు. సమాజంలో కులమతాలు, అసమానతలను తొలగించడానికి సర్వమతాలకు దేవుడు ఒక్కడేనన్న దైవభక్తిని పెంపొందించే విధంగా గీతాసారం చెబుతుందన్నారు. అనంతరం భగవద్గీత ద్వారా సమస్యల పరిష్కారమార్గంగా ఎలా ఉంటుందో వివరించారు. కార్యక్రమంలో సుధాకర్, మోహనమ్మ, మాధవి, విజయక్క, నీలావతి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కోర్టు ఉత్తర్వులు అమలు చేయడం లేదు'



సమస్యలను ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు చెప్పుకునేందుకు వచ్చిన బాధితులు

అనంతపురం అర్బన్: భూమిపై హక్కులు తమకే వర్తిస్తాయని జిలా సివిల్ కోర్టు, ఆర్డీఓ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అనంతపురం రూరల్ తహసీల్దార్ అమలు చేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు చెప్పుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు రమేష్‌బాబు, ఉప్పరి సుబ్బమ్మ, పుష్పావతి, తదితరులు మీడియాతో మాట్లాడారు. ఉప్పరపల్లి గ్రామ పొలం సర్వే నంబర్ 133, 164-1లో 13.18 ఎకరాల పొలం ఉందన్నారు. ఈ భూమి రమేష్ బాబు, ఉప్పరి సుబ్బమ్మ, సరోజమ్మ, వెంకట సుబ్బమ్మ, లక్ష్మీదేవి, రాకేష్ బాబు, రవి కుమార్, పుష్పావతికి ఉందన్నారు. అయితే రుషింగమయ్య అనే వ్యక్తి అడ్డుపడుతున్నాడని చెప్పారు. భూ వివాదంపై సివిల్ కోర్టు, ఆర్డీఓ కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. అయితే తీర్పులను అనంతపురం రూరల్ తహసీల్దారు అమలు చేయడం లేదని చెప్పారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌ను బాధితులు కలిసి వినతిపత్రాలు అందజేశారు.

నిందితులకు రిమాండ్

అనంతపురం: నగరంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరిని 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. వివరాలు.. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గుత్తి రోడ్డు సమీపంలో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే బ్లూకోల్ట్స్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గంగరాజు, హోంగార్డు రామాంజనేయులు అక్కడికి వెళ్లారు. బుక్కరాయసముద్రం మండలం ఎల్బీ నగర్‌కు చెందిన షేక్ షఫీ, షేక్ టిప్పు సుల్తాన్ బహిరంగంగా మద్యం సేవిస్తూ ఉన్నారు. పోలీసులు గమనించి చట్ట వ్యతిరేకమని ఓపెన్ డ్రింకింగ్ చేయరాదని సూచించారు. పెడచెవిన పెట్టడమే కాకుండా బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులకు ఆ ఇద్దరు ఆటంకం కలిగించారు. ఈ క్రమంలో షేక్ షఫీ, షేక్ టిప్పు సుల్తాన్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. సోమవారం మొబైల్ కోర్టులో హాజరుపరచడంతో 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు. నిందితులను జిల్లా జైలుకు తరలించామని పోలీసులు పేర్కొన్నారు.

దారులపై కంపు..
తరలిస్తేనే ఇంపు



జీసస్ నగర్ మెడికల్ కళాశాల క్వార్టర్స్ ముందు పేరుకుపోయిన చెత్త



దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్తున్న మహిళ

నగరంలో చెత్తను సకాలంలో తరలించకపోవడంతో రోడ్లు కంపు కొడుతున్నాయి. ఎక్కడ చూసినా చెత్తా చెదారం కనిపిస్తోంది. నగరంలోని సాయి నగర్, అరవింద నగర్, జీసస్ నగర్, నాయక్ నగర్, రాణి నగర్, గుల్జార్‌పేట, 1, 2, 3, 4, 5, రోడ్లు, ఆజాద్ నగర్, కమలా నగర్, సూర్య నగర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో చెత్తను పూర్తి స్థాయిలో తరలించడం లేదు. చెత్తను తరలించేందుకు అద్దె ట్రాక్టర్లను ఏర్పాటు చేసినా.. అవి సరిగా తిరగడం లేదు. చెత్తను తరలించేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతోంది. నగరపాలక సంస్థ కార్యదర్శి, ఇన్‌చార్జ్ ఎంహెచ్‌ఓ క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు ఉదయం నుంచి విధులకు హాజరుకావాల్సి ఉంది. కానీ వారు రాక పోవడంతో నగరపాలక సంస్థ కార్మికులు తూతూమంత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

- అనంతపురం కార్పొరేషన్/ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



నాయక్‌నగర్ సిమెంట్ గోడౌన్ ముందు రోడ్డును ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఇక ఎయిర్‌టెల్ వంతు..

- అర్ధరాత్రి యంత్రాలతో రోడ్లు ఛిద్రం

కూటమి ప్రభుత్వంలో నగరంలో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఇప్పటికే ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ నిర్వాహకులు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లను ధ్వంసం చేసింది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పునరుద్ధరణ పనులు చేపడుతోంది. ఇప్పుడు ఎయిల్‌టెల్ కంపెనీ వంతు వచ్చిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎయిల్‌టెల్ కంపెనీ వారు ఫైబర్ పేరుతో నగరంలో అడ్డదిడ్డంగా తవ్వకాలు చేపడుతున్నారు. నగరంలోని నాయక్ నగర్‌లో అర్ధరాత్రి తవ్వకాలు చేపట్టారు. నగరపాలక సంస్థ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రూ.లక్షలు వ్యయం ఖర్చు చేసి ఏర్పాటు చేసిన బీటీ రోడ్డుకు చిల్లులు పడుతున్నాయి. నగరంలో ఇష్టానుసారంగా రోడ్డు పనులు చేపడుతున్నా.. ఇంజినీర్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. - అనంతపురం కార్పొరేషన్

అక్రమ అరెస్టులు దుర్మార్గం

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, దాడులు, కక్షసాధింపులు తారాస్థాయికి చేరాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వస్తున్న ఆదరణ ఓర్వలేక ఆయనకు సన్నిహితంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నారు. కూటమిలో అప్రజాస్వామిక పాలన సాగుతోందని' మేయర్ వసీం ఆరోపించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. ఏడుగుర్రాలపల్లిలో ఓ మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం జరిగితే ఇంత వరకు సీఎం చంద్రబాబు నాయుడు స్పందించకపోవడం దారుణమన్నారు. బాధితురాలికి ధైర్యం చెప్పేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు వెళితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలని చూడకుండా అరెస్టు చేయడం దారుణమన్నారు. అదేవిధంగా లిక్కర్ స్కాం పేరుతో ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం జరిగిందన్నారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగానే మిథున్ రెడ్డిని పోలీసులను అడ్డంపెట్టుకుని ఇబ్బంది పెట్టేలా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది కూటమి ప్రభుత్వం కాదని కుట్రల ప్రభుత్వమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నియంతలా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు మేలు చేయాల్సిన దానిపై ఆలోచించకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

ప్రజాప్రతినిధి కనుసన్నల్లో లిక్కర్ విక్రయాలు

ఇటీవల ఓ ఎమ్మెల్యే.. మిథున్ రెడ్డి అరెస్టుతో కల్తీ మద్యం తాగి మరణించిన వారి ఆత్మలు శాంతించాయని ఆరోపణలు చేశారు. వాస్తవంగా నగరంలోని వివిధ డివిజన్లలో ఉన్న 33 వైన్ షాపుల్లో 20కి పైగా సదరు ప్రజాప్రతినిధివే అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు ఆరోపించారు. వందల సంఖ్యలో బెల్టుషాపులను ఏర్పాటు చేసి పబ్లిక్‌గా మద్యం తాగిస్తోంది నీవు కాదా అని ప్రశ్నించారు. నీ బండారం బట్టబయలు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. పోలీసులు ఇండియన్ పీనల్ కోడ్ పక్కాగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్ భూషణ్, ఇషాక్, శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, రహంతుల్లా, రాధాకృష్ణ, అసిఫ్, రామచంద్ర పాల్గొన్నారు.

'అనంత'ను అగ్రస్థానంలో నిలుపుదాం

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ నిర్దేశించిన అన్ని పథకాలు వంద శాతం అమలు చేసి అనంతపురం డివిజన్‌ను అగ్రస్థానంలో నిలుపుదామని నూతన ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. శనివారం ఏడీఏగా బాధ్యతలు తీసుకున్న ఆయన సోమవారం డివిజన్ కార్యాలయంలో ఆరు మండలాల ఏవోలతో సమావేశం నిర్వహించారు. వర్షపాతం, విత్తన పంపిణీ, ఖరీఫ్ కింద సాగైన పంటల విస్తీర్ణం, ఇంకా సాగులోకి రావాల్సిన విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై చర్చించారు. అనంతపురం పరిసర మండలాల్లో గత రెండు మూడు రోజులుగా వర్షం పడినందున రైతులు పంటలు సాగు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నెలాఖరు వరకు సమయం ఉన్నందున.. ఆ తర్వాత ఆర్‌ఎస్‌కే వారీగా ప్రత్యామ్నాయ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి మంగళ, బుధవారం 'పొలం పిలుస్తోంది' ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. మిగతా రోజుల్లో కూడా పొలంబాట ద్వారా రైతులకు సహాయ సహకారిగా ఉండాలని సూచించారు. కొత్త ఏడీఏగా బాధ్యతలు తీసుకున్న అల్తాఫ్ అలీఖాన్‌కు ఏఓలు, ఏఈఓలతో పాటు విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, అసోసియేషన్ నాయకులు, విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్వాహకులు పెద్ద ఎత్తున పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో అనంతపురం, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు, కూడేరు, ఆత్మకూరు మండలాల ఏఓలు వెంకటకుమార్, సోమశేఖర్, శ్యాంసుందరరెడ్డి, చైతన్యకుమార్, శుభకర్, టెక్నికల్ ఏవో సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏఓలతో సమావేశమైన ఏడీఏ జీఎం అల్తాఫ్ అలీఖాన్

పీర్లు చూసేందుకు వెళ్లి మృత్యువాత

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ సుందరయ్యకాలనీలో పీర్లు చూసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ఉన్నఫలంగా కుప్పకూలి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం శివారులోని నందమూరినగర్‌కు చెందిన రామాంజనేయులు (54) నగరంలోని హౌసింగ్‌బోర్డు రాజీవ్‌చిల్డ్రన్ పార్కులో వాచర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో సుందరయ్యకాలనీలో పీర్లు చూసేందుకని వెళ్లిన ఆయన అక్కడ కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లి వద్ద జాతీయ రహదారిపై నిలిపిన లారీని వెనుకవైపు నుంచి కారు ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కళ్యాణదుర్గానికి చెందిన రాజేష్ మేనమామ సంగప్పకు సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బంధువు అయిన రాజు తన కారులో జానకి, మల్లక్కలతో కలసి అనంతపురానికి బయల్దేరారు. మార్గంమధ్యలో కాలువపల్లి వద్ద నిర్లక్ష్యంగా ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో కారులోని ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదంపై రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఎస్‌కేపీజీడీసీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ కోర్సుల రెండో సెమిస్టర్ ఫలితాలను ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వెంకటరమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరామ్ నాయక్ విడుదల చేశారు. సోమవారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ 279 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 169 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మార్క్స్‌మెమోలు కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, రీవాల్యూయేషన్ లేదా రీకౌంటింగ్‌కు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో సహకరించిన కాలేజీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ ఆర్.నాగరాజు, కమిటీ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

న్యాయం చేయమని అడిగితే హౌస్ అరెస్టులా?

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్



అనంతపురం కార్పొరేషన్: రాప్తాడు నియోజకవర్గంలోని ఏడుగుర్రాలపల్లిలో మృగాళ్ల చేతిలో సామూహిక అత్యాచారానికి గురైన మైనర్ బాలికలకు న్యాయం చేయాలని హోంమంత్రి అనితను కోరాలని చూసిన వైఎస్సార్‌సీపీ యుజవన, విద్యార్థి విభాగం నాయకులను హౌస్ అరెస్టు చేయడం దారుణం. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కూటమి పాలన సాగుతోంది' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 16న మైనర్ బాలిక సర్వజనాస్పత్రిలో మగ బిడ్డను ప్రసవించిందన్నారు. సామూహిక అత్యాచారం జరిగి నెలలవుతున్నా.. కూటమి ప్రభుత్వం బాలికకు అండగా నిలిచిన పాపాన పోలేదన్నారు. ఆ దళిత బిడ్డకు అండగా ఉండాలని ఈనెల 20న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, ఎస్సీ సెల్ నాయకులు పెన్నోబులేసు, చామలూరు రాజగోపాల్, ఎగ్గుల శ్రీనివాసులు, మల్లెమీద నరసింహులు పరామర్శించడానికి వెళితే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు. ఇంతకన్నా దారుణం ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. హోంమంత్రిని కలసి బాధిత బాలికకు న్యాయం చేయాలని చూస్తే కూటమి ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసిందన్నారు. ప్రజల పక్షాన నిలబడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమ అరెస్టు చేసి అణచివేయాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోరాటాలకు పెట్టింది పేరు అని గుర్తు చేశారు. మేమంతా జగనన్న సైనికులమని ప్రభుత్వంపై పోరాడేందుకు అనునిత్యం కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో దౌర్జన్యాలు, కక్ష సాధింపులకు పాల్పడితే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ జయప్రదం చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆగస్టు 4, 5 తేదీల్లో శింగనమలలో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాస్థాయి ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా రంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బీజేపీ ప్రభుత్వం విద్య వ్యవస్థను పూర్తిగా నాశనం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. విద్యను కాషాయకరణ, ప్రైవేటీకరణ చేయడంలో భాగంగానే సెంట్రల్ యూనివర్సిటీల్లో ఆర్‌ఎస్‌ఎస్ వాదులను ప్రొఫెసర్స్‌గా నియమకాలు చేస్తున్నారన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది పూర్తయినా ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రూ. 6,400 కోట్ల బకాయిల గురించి ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెన్నెళ్లవుతున్నా డిగ్రీ అడ్మిషన్స్ ప్రారంభించకపోవడం దౌర్భాగ్యం అన్నారు. ప్లీనరీ సమావేశాల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో చేపట్టబోయే పోరాటాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా బాలికల విభాగం కన్వీనర్ రజిత, జిల్లా ఉపాధ్యక్షుడు వైటిసి రమేష్, తరిమెల గిరి, సూర్య ప్రకాష్, భీమేష్, వెంకటేష్, శివ, వంశీ, పవిత్ర పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తప్పిపోయిన బాలుడి అప్పగింత

అనంతపురం: ఓ తప్పిపోయిన బాలుడి ఆచూకీ కనుగొన్న పోలీసులు.. తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. ఆలుమూరు రోడ్డు సమీపంలో నివాసం ఉన్న కమలమ్మ, బొజ్జన్న దంపతుల కుమారుడు చేతన్ (4 సంవత్సరాలు) సోమవారం ఉదయం ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక రుద్రంపేట బైపాస్ వద్ద ఏడుస్తుండటంతో గమనించిన స్థానికులు డయల్-100కు సమచారం ఇచ్చారు. అనంతపురం నాలుగో పట్టణ సీఐ జగదీష్ వెంటనే స్పందించి బ్లూకోల్ట్స్ సిబ్బందిని చిన్నారి ఉన్న ప్రదేశానికి పంపారు. చేతన్‌ను చేరదీసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సురక్షితంగా ఉంచారు. మరో వైపు చిన్నారిని వెతుక్కుంటూ వెళ్లిన తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఆలుమూరు రోడ్డు సమీపంలో ఉంటున్న కమలమ్మ, బొజ్జన్న ఆచూకీ కనుక్కొని పోలీస్ స్టేషన్‌లో ఆ చిన్నారిని అప్పగించారు. కేవలం గంటలోపు చిన్నారిని తమ వద్దకు చేర్చడంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న నాలుగో పట్టణ సీఐ జగదీష్

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

రాయదుర్గంటౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గంలో కెనరా బ్యాంకు ఏర్పాటై 25 ఏళ్లు గడిచిన సందర్భంగా బ్యాంకు కార్యాలయంలో సోమవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. స్థానిక బ్రాంచి మేనేజర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఖాతాదారులను ఉద్దేశించి ఆర్‌ఎం మాట్లాడుతూ జిల్లాలో 63 కెనరా బ్యాంకు శాఖలు ఉన్నట్లు చెప్పారు. ఓవరాల్‌గా రూ.160 కోట్ల వార్షిక బిజినెస్ లావాదేవీలు జరుగుతున్నట్లు తెలిపారు. కెనరా బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్లతో పాటు అన్ని రంగాలకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వసతి ఉందన్నారు. అనంతరం సీనియర్ ఖాతాదారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ శేఖర్, మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి, సిబ్బంది ప్రదీప్‌కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతపురం: నగరంలోని భవానీ నగర్‌లో నివాసం ఉంటున్న హేమంత్ కుమార్ అనే యువకుడు కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలతో ఆదివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన హేమంత్ కుమార్ గత కొన్నేళ్లుగా అనంతపురంలోని భవానీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలతో విసిగిపోయిన అతడు.. ఆదివారం శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. మంటలు తాళలేక గట్టిగా కేకలు వేశాడు. గమనించిన స్థానికులు అతడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హేమంత్ కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఏకరీతి పరీక్ష విధానం అనుసరించాలి



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో మారిన పరీక్ష విధానం, ప్రశ్నాపత్రం ఎంపిక, నూతన సిలబస్, నూతన విద్యా విధానం అంశాలపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సోమవారం సాయంత్రం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు డీఈఓ ఎం. ప్రసాద్ బాబు, ఉప విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, మల్లారెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, ఏడీ మునీర్ ఖాన్, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు హాజరయ్యారు. ప్రస్తుత పరీక్ష విధానంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఏకరీతి పాఠ్యాంశాలు ఉన్నాయని డీఈఓ పేర్కొన్నారు. అందరూ ఏకరీతి పరీక్ష విధానాన్ని అనుసరించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు కూడా ప్రభుత్వ ప్రశ్నపత్రాలను ఉపయోగించి తమ పాఠశాలలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం



మాట్లాడుతున్న దేవేందర్

అనంతపురం కార్పొరేషన్: ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అనైతిక చర్య అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అరెస్టును ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిక్కర్ స్కాం పేరుతో కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. వాస్తవంగా మొదట్లో లిక్కర్ స్కాం రూ.30 వేల కోట్లు, రూ.18 వేల కోట్లు, రూ.3 వేల కోట్లు అంటూ టీడీపీ నాయకులు తలోమాట అంటూ వస్తున్నారన్నారు. వాస్తవంగా ఎటువంటి లిక్కర్ స్కాం జరగకపోయినా కక్షపూరితంగా వైఎస్సార్ సీపీ కీలక నేతలను అరెస్టు చేయించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నగరాధ్యక్షుడు లక్ష్మణ్ణ, నాయకులు రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉద్యోగి ఆకస్మిక మృతి



శివనారాయణరెడ్డి (ఫైల్)

అనంతపురం సిటీ: స్థానిక హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న జెడ్పీ ఉద్యోగి శివనారాయణరెడ్డి(56) సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక తుదిశ్వాస వదిలినట్లు వివరించారు. మొన్నటి వరకు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేసిన శివనారాయణరెడ్డి.. ఇటీవల బదిలీపై పెనుకొండలోని ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న జెడ్పీ ఉద్యోగులు పలువురు ఇంటికి వెళ్లి శివనారాయణరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అనంతపురం: నగరంలోని టీవీ టవర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం అశోక్ రెడ్డి మృతి చెందగా.. వృద్ధుడు రమణ (78) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వివరాలు.. తాడిమర్రికి చెందిన అశోక్ రెడ్డి బైక్‌పై ఆదివారం నగరం వైపు వస్తున్నాడు. రమణ అనే వృద్ధుడు రోడ్డు దాటుతుండగా.. బైక్ అదుపు తప్పి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అశోక్ రెడ్డి , రమణకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అశోక్ రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తీవ్ర గాయాలు పాలై చికిత్స పొందుతున్న రమణ సోమవారం మరణించాడు.